
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 89



# తెలుగువారి గుండెల్లో చిరాయుష్కుడు హనుమచ్ఛాస్త్రి

జీవితాన్ని ఒక సాహిత్యోత్సవంగా జీవించిన పండితుడు, నిర్మోహమాటి శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. ఇది ఆయన శత జయంతి సంవత్సరం. 28 కథలు, 67 వ్యాసాలు, కావ్యాలు,గేయాలు, నాటికలు, కథానికలు పద్య ఖండికలు వ్రాసి రచయితలను, పాఠకులను కొత్త ఆలోచనా లోకాల్లోకి నడిపించి 'సృష్టిలో తియ్యనిది స్నేహమేనోయ్' అని ఎలుగెత్తి చాటిన ఆ మహానుభావుని గురించి నవ్య నీరాజనం మీ కోసం...

## బాల్యం

1930ల కాలమంటే ప్రపంచానికి ఆర్థిక మాంద్యం తెచ్చిపెట్టిన కాలం కావచ్చు. కాని-తెలుగు సాహిత్యానికి మాత్రం ఉజ్వల కాలం-. 1910 నుంచి లేచిన రచనా పరమైన ఆధునిక దృక్పథం మన సృజనాత్మక రచనా విధానాన్నే మార్చేసింది. కవిత్వంలో ఖండ కావ్యాలు, గేయ రచనలు, వచనంలో కథా, నవలా రచనలు, ఇటు రచయితల్ని, అటు పాఠకుల్ని, కొత్త ఆలోచనా లోకాల్లోకి నడిపించాయి.

అలా నడిపించబడిన నవ్య రచయితలలో రెండవ తరానికి చెందిన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు ఒకరు. ఇది శాస్త్రిగారి శత జయంతి సంవత్సరం. విశాఖజిల్లా వీరవల్లి తాలూకా మాడుగుల సంస్థాన గ్రామంలో 1911 ఆగస్టు 29వ తేదీన జన్మించారు. శాస్త్రిగారు తూర్పుగోదావరి జిల్లా కోనసీమ లోని పాలగుమ్మి గ్రామంలో సంస్కృత కావ్యనాటకాలంకారాలు చదువుకోవడంతో జీవితం ప్రారంభించారు. డిగ్రీలు లేని పాండిత్యం వన్నెకు రాదని గురువు శ్రీ మంథా నరసింహ శాస్త్రి గారు సూచించిన సలహా ప్రకారం విజయనగరం మహారాజా సంస్కృత కళాశాలలో 'ఉభయ భాషా ప్రవీణ' చదువుకోసం 1928లో చేరారు.

## తొలి పద్య ఖండిక

అది మహా విద్వాంసుల విజయనగరం. గురజాడ అప్పారావు గారి విజయనగరం. ఆధునిక సాహిత్య వికాసానికి వెలుగులు నింపిన విజయనగరం.

వఝుల చిన సీతారామశాస్త్రి, ఆకొండి వేంకటశాస్త్రి, దూసి రామమూర్తి, పరవస్తు రామానుజస్వామి వంటి మహా పండితులు అప్పటి సంస్కృత కళాశాలలో శాస్త్రి గారికి గురువులు.

ఆనాటి దేశ సాహిత్య వాతావరణంలో చర్చలన్నీ ఆ కళాశాల విద్యార్థుల్లోనూ చర్చనీయాంశాలయ్యేవి. జమ్మలమడక మాధవ రామశర్మ, పి.గణపతి శాస్త్రి ప్రభృతులు అదే కళాశాలలో చదువుతూండడం వల్ల ఆధునిక సాహిత్యాభిరుచులు, సమర్థనలు సహజంగా ఉండేవి. హనుమచ్ఛాస్త్రి గారు కూడా ఆ చర్చల్లో పాల్గొంటూ ఉండేవారు. శ్రీ రంగం నారాయణ బాబుగారి పరిచయం కూడా అప్పట్లో శాస్త్రి గారికి ఏర్పడింది. 1929 లో 'స్మృతి కణాలు' అనే తొలి పద్య ఖండిక వ్రాసి, 'భారతి'లో ప్రచురించారు. 1930లో తొలి వ్యాసం 'ఆధునిక కవిత్వం-తద్భిన్నాభిప్రాయములు' వ్రాసి 'భారతి'లోనే ప్రకటించారు.

1931-1932 కాలంలో కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో తన చదువు చివరి సంవత్సరం చదవ వలసి వచ్చింది. అప్పట్లో రాజమండ్రీలో యువ సాహిత్య మిత్రుల పరిచయం బాగా ప్రభావితం చేసింది. 1932లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి 'ఉభయ భాషా ప్రవీణ' బిరుద పట్టం పొందగానే, రాజమండ్రీ లోనే 'దేశబంధు' దువ్వూరి సుబ్బమ్మగారు నడిపే స్త్రీ విద్యా సదనంలో శాస్త్రిగారు ఉద్యోగానికి చేరారు. గిడుగు రామమూర్తి పంతులుగారి సప్తతి మహోత్సవ సందర్భంగా జరిగిన సభల్లో 'గురజాడ వాల్మీకి' అనే వ్యాసం చదివి నాటి యువ రచయితలందరికీ సన్నిహితులయ్యారు. నవ్య సాహిత్య పరిషత్తులో సభ్యులూ, ఆ సంస్థ నడిపే 'ప్రతిభ' పత్రిక సంపాదక మండలి సభ్యులూ అయ్యారు. క్రమంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మునిమాణిక్యం, భమిడిపాటి, విశ్వనాథ ప్రభృతులందరితో సన్నిహిత పరిచయాలేర్పడ్డాయి.

వివాహానంతరం, 1934లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురంలో బోర్డు నేషనల్ హైస్కూలులో సంస్కృతాధ్యాపకులుగా ఉద్యోగంలో చేరారు. నాటి నుంచి 1964 వరకు అక్కడే ఉంటూ తమ సాహిత్య వ్యాసంగాన్ని శాస్త్రిగారు కొనసాగించారు. హనుమచ్ఛాస్త్రిగారు 1964లో నెల్లూరు జిల్లా కావలి (జవహర్ భారతి) కళాశాల వారి ఆహ్వానం మేరకు వెళ్లి, పది సంవత్సరాలపాటు విద్యార్థులకు తెలుగు, సంస్కృతం బోధించారు. తన ప్రధాన విమర్శ గ్రంథాలు అక్కడే వ్రాశారు.

తరచుగా జరిగే సాహిత్య సభల్లో ఆధునిక తెలుగు సాహిత్యం గురించీ, భాస, కాళిదాస, భవభూతి ప్రభృతి సంస్కృత కవుల గురించీ, ప్రసంగాలు చేసేవారు. ఆయన మంచి వక్త. కృష్ణశాస్త్రి కవిత్వం, శ్రీశ్రీ కవిత్వం వ్యక్తిత్వం, విశ్వనాథ భావుకత్వం, చలం రచనా వైశిష్ట్యం, శ్రీపాద, మునిమాణిక్యం, బుచ్చిబాబు, పద్మరాజు, కుటుంబరావు వంటి సమకాలీన కథకుల రచనా ప్రతిభ గురించి,-ఇంటికి వచ్చే యువ రచయిత మిత్రులతో, తన విద్యార్థులతో గంటల కొద్దీ మాట్లాడేవారు. రామచంద్రపురం ప్రాంతాలకి వచ్చే రచయిత మిత్రులు ఒక రోజో, కనీసం ఒకపూటో, శాస్త్రి గారి ఇంట్లో మకాం చేసేవారు.


1940వ దశలో రామచంద్రపురంలో ఆంధ్ర అభ్యుదయోత్సవాలు, వసంతోత్సవాలు, మహోత్సాహంతో నిర్వహించి నాటి ప్రముఖ రచయితుల్ని, పండితుల్ని రప్పించి, ఉపన్యాసాలిప్పించారు. 1957-59 నడుమ ద్రాక్షారామంలో జరిగిన ఆంధ్ర వైజ్ఞానికోత్సవాలలో ఆయన ఆధ్వర్యం వహించిన సాహిత్య సభ వైభవాలను నేటికీ గుర్తు చేసుకునేవారు ఉన్నారు.

1956లో చలం మీద 'తెలుగు స్వతంత్ర' పత్రిక నడిపిన దండయాత్రకు శ్రీహనుమచ్ఛాస్త్రి-వజీర్ రహ్మాన్ కోరికపై-దీటైన సమాధానం ఇచ్చి చలం రచనా వ్యక్తిత్వ ప్రతిభను సమర్థించారు.

## 'కథానిక' సృష్టికర్త

1937లో నవ్య సాహిత్య పరిషత్ పత్రిక 'ప్రతిభ'లో తెలుగులో చిన్న కథకు 'కథానిక' అనే పేరును సూచిస్తూ సోపపత్తికంగా ఒక వ్యాసం వ్రాశారు. శ్రీశ్రీ ప్రభృతులు ఆ సూచనను సమర్థించడంతో 'కథానిక' అనే పేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. కేవలం పేరు సూచించడమే కాదు: నాటి ప్రసిద్ధ పత్రికలు అన్నిటా శాస్త్రిగారు ముప్పై వరకు కథానికలు వ్రాసి, ప్రకటించారు. ఆ కథల్లో తరచుగా ప్రేమ వైఫల్యాలు, చిన్న తరగతుల వారికి జరిగే అన్యాయాలు, స్వప్న భంగాలు, తీరని అసంతృప్తులు, ఇతి వృత్తాలయ్యాయి. శాస్త్రిగారిలోని సౌందర్య దృష్టి, సున్నితమైన మానసిక వేదనలు, కథన శిల్పం, మనం బాగా గుర్తించవచ్చును.

శాస్త్రి గారికి సాయంకాలాల వేళ స్నేహితు



భీమవరంలో ఒక సన్మాన సభలో..

లతో గాని, తనకు దగ్గరగా మసలే విద్యార్థులతో గాని, తన పిల్లలతో గాని షికారు వెళ్లడం అలవాటు. ఆ సమయాలలో తన అనుభవాలు, అనేక సాహిత్య విషయాలు, చెపుతూండే వారు. తన ముగ్గురు కొడుకుల్లో ఎవరో ఒకరిని, తను ఉపన్యాసాల కోసం ఏ వూరు వెళ్లినా కూడా, తోడు తీసుకు వెళ్లే అలవాటు కూడా ఉండేది. 18-19 ఏళ్లు వచ్చిన తన పిల్లల్ని ఆయన అక్షరాలా స్నేహితుల్లాగే చూశారు. బాగా చదవడం, నిష్కర్షగా వ్రాయడం, మొగమాటాలకు తావివ్వక పోవడం కచ్చితంగా చేశారు. ''నువ్వు ఏ మైనా అనుకో!: నాకు ఇలా వుంది'-అని మాట్లాడడం ఆయన స్వభావం.

విద్యార్థి దశ నుంచి స్వభావంలో ఒక తిరుగుబాటు మనస్తత్వం ఆయనలో ఉండేది. ఆయన, సాహిత్యంలో స్పష్టంగా ఆధునిక దృక్పథం అలవరచుకోవడానికి అది సహకరించింది. కాని, జీవితంలో ద్వైధీభావం ఆయనను విడిచిపెట్టలేదు. అందుకే సరైన సమయంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేక, తరువాత, కొన్ని మానసిక అసంతృప్తులకు గురి అయ్యారు.

1950 దశ వరకు హనుమచ్ఛాస్త్రి ఎక్కువగా పద్య ఖండికలు గాని, పద్య కావ్యాలు గాని, వ్రాయలేదు. 1949 లో ద్రాక్షారామ భీమేశ్వరాలయం దర్శించి వచ్చాక, 'దక్షా రామము' అనే మూడు దృశ్యాల పద్య కావ్యం-లఘు క్షేత్ర కావ్యం-వ్రాశారు. అటు ప్రాచీన ప్రౌఢ పద్య కవుల పద్య శిల్పం, ఇటు ఆధునిక భావ కవుల భావ ప్రకటన లాలిత్యం, భావుకవిత్వం, కలగలిసిన మిశ్ర శిల్పం ఒకటి ఆయనకు పట్టుబడింది. దీని తరువాత సుమారు పాతికేళ్లకి, 'కీర్తితోరణము' అనే పెద్ద కావ్యమే-పద్యకావ్యం-వ్రాశారు. ఇది కాకతీయ పాలకుల సంస్కృతీ సభ్యతలను చిత్రించే కావ్యం. ఇది కూడా దృశ్యాలుగా తొమ్మిది ప్రకరణాలుగా ఉంటుంది. కృష్ణశాస్త్రిగారు కావ్యం చదివి ఉత్తరం రాస్తూ-''కవికి కవిత్వం యౌవనంలో వస్తుందంటారు. ఈ ముసలితనంలో ఎంత బాగా వ్రాశారు!'' అన్నారు.

### 'గౌతమీ గాథలు'

1934-1964 మధ్య రామచంద్రపురంలో ఉండగా-గౌతమీ తీరంలో తన జీవిత, సాహిత్యానుభవాలను క్రోడీకరిస్తూ-వ్రాసిన స్వీయ చరిత్రాత్మక రచన 'గౌతమీ గాథలు' 1981లో వెలువడింది.

హనుమచ్ఛాస్త్రి గారి చివరి రచన ''ఆరు యుగాల ఆంధ్ర కవిత''-1980లో భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ, సీనియర్ ఫెలోషిప్ ఇచ్చి - వ్రాయించిన ప్రాచీన పద్య కవిత్వ విమర్శ యిది.

నన్నయభట్టు మొదలు, దక్షిణాంధ్ర యుగం చివరి కవులలో ఒకడైన కంకంటి పాపరాజు వరకు నడిచిన కవుల కావ్యకళా స్థాయిని అంచనా వెయ్యడం, ఈ రచన ప్రధానోద్దేశం. ఈ మొత్తం కాలాన్ని ఆరు సాహిత్య ఋతువులుగా భావించి, నిష్కర్షగా నిర్వహించిన విమర్శ ఇది. ఈ పుస్తకాన్ని 1986లో హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రకటించింది.



సోదరుడు సత్యనారాయణ, కుటుంబసభ్యులతో

### రేడియో అనుబంధం-కథల పుస్తకం

1930-45 మధ్యకాలంలో హనుమచ్ఛాస్త్రి గారు ఎక్కువగా కథానికలు, పాటలు, రేడియో నాటికలు, సాహిత్య వ్యాసాలు వ్రాశారు. హనుమచ్ఛాస్త్రిగారి లలిత గీతాలు 1940-1980 ల మధ్య కాలంలో మద్రాసు, విజయవాడ, హైదరాబాదు రేడియో కేంద్రాల నుండి ఎక్కువగా ప్రసారమవుతూ ఉండేవి. 1938లో మద్రాసు రేడియో కేంద్రం పెట్టాక, అందులో కార్యక్రమాలు నిర్వహించే ఆచంట జానకిరామ్‌గారు శాస్త్రిగారి చేత భాస మహాకవి సంస్కృత ఏకాంకికలను తెలుగులో ప్రసారం కోసం వ్రాయించారు. తరువాత శాస్త్రిగారు స్వతంత్ర నాటికలు కూడా మరికొన్ని వ్రాశారు.

2006వ సంవత్సరంలో, శాస్త్రిగారు మొత్తం వ్రాసిన 28 కథల్ని ''మౌన సుందరి-ఇతర కథలు'' పేరిట పుస్తకంగా ప్రచురించడమైంది.

ప్రస్తుతం ఈ 2010 సంవత్సరం శాస్త్రిగారు వ్రాసిన 67 వ్యాసాలను, ఆయన శత జయంతి సందర్భంగా-''సాహిత్య సంచారం' పేరిట తొలిసారిగా, పుస్తకరూపంలో వెలువరించడం జరుగుతుంది.

### పురస్కారాలు

బహుశా-1949లో!- హెచ్.ఎం.వి.గ్రామఫోన్ కంపెనీవారు తెలుగు గీత రచన పోటీ పెట్టారు. అందులో శ్రీ హనుమచ్ఛాస్త్రి వ్రాసిన 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయి' అనే పాటను ఎంపిక చేసి, స్వర్ణ పతకం బహూకరించారు. శ్రీ పెండ్యాల నాగేశ్వరరావుగారు స్వరపరచగా ప్రముఖ గాయని రావు బాల సరస్వతీ దేవిగారు పాడారు. హెచ్.ఎం.వి. వారు ఈ పాటను రికార్డుగా విడుదల చేశారు.

విమర్శ గ్రంథాలలో 1972లో కాళిదాస కళా మందిరము' వెలువడి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ విమర్శా పురస్కారాన్ని పొందింది. 'కీర్తితోరణము' కావ్యం 1978లో వెలువడి, ఉత్తమ నవ్య కావ్య పురస్కారాన్ని పొందింది.

'సారమతి నన్నయ' విమర్శ గ్రంథం, కొందరు నవ్య విమర్శకులు నన్నయ్య కావ్య శైలి మీద, లక్ష్యం మీద, చేసే విమర్శలలో న్యాయం లేదని చెప్పడానికి, గాఢాధ్యయనం చేసి ప్రకటించిన గ్రంథం.

### పండితుడు-ఆధునికుడు

శ్రీ హనుమచ్ఛాస్త్రి ఎంతటి పండితుడో, అంతటి ఆధునికుడు. యువ రచయిత లెందరికో మిత్రుడు. ఏనాడూ, ఎవరి ప్రాపు కోరని వాడు. నిష్కర్షగా మాట్లాడినవాడు. మంచి రచనను ఏ అరమరికలు లేకుండా హృదయానికి హత్తుకున్నవాడు. తన జీవితాన్ని ఒక సాహిత్యోత్సవంగా జీవించిన వాడు.

విశాఖజిల్లాలో పుట్టి, తూర్పు గోదావరి, నెల్లూరుజిల్లాలలో ఉద్యోగాలు చేసి, కృష్ణాజిల్లా విజయవాడలో షష్టిపూర్తి జరుపుకుని, వరంగల్‌లో 1987 నవంబరు 14వ తేదీన పరమపదించిన శ్రీ హనుమచ్ఛాస్త్రి-తెలుగు ప్రజలందరికి చెందిన ''చిరంజీవి'' ''చిరాయుష్కుడు'' అనదగిన వ్యక్తి.

-ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

నాకు నచ్చిన మా నాన్న కథ

# నిప్పు నుంచి నీరు

- ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

**శ్రీశైలం పాతాళగంగ రేవు -**
**ఇంకా తెల్లవారలేదు-**
**అరుణోదయం కుంకుమ చెట్ల చివర్ల నుంచి ఇంకా నీటిమీద పడడం లేదు.**
**అయినా తడుముకుంటూ ఒక సాధువు మెట్ల మీద నుంచి నీటి దగ్గరకు అంత ఎత్తు నుంచీ దిగుతున్నాడు.**
**మధ్యవయస్సు దాటి, పక్కకు తిరుగుతున్న శరీరం, చేతిలో చిన్న పేపబుట్ట.**



నడుముకు చుట్టబెట్టుకున్న కావిరంగు గుడ్డ సవరించుకుని మెడ మీద వున్న కాషాయపుతుండు నడుముకు చుట్టుకుని చిన్న అలలతో గలగల పారే కృష్ణ నీటిలోకి దిగి చలిని లెక్కచేయకుండా మూడు మునుగులు మునిగి అస్పష్టంగా ఏదో ఉచ్చరిస్తూ తుండు పిండి తల తుడుచు కున్నాడు. తల అంటే వట్టి బోడిబుర్ర.

స్నానం పూర్తి అయింది. నీళ్ళలో నిలబడే అనుష్ఠానం అర్ఘ్యప్రదానం చేశాడు. పూర్తి అయింది. దూరంగా పక్కగా ఒక మెట్టుమీద కూర్చుని బుట్టలోని విభూతి ఒంటినిండా పూసుకుని ముదిరిన బూడిద గుమ్మడి కాయలా వున్నాడు.

కళ్ళు మూసుకుని ధ్యానంలో మునిగిపోయాడు. అంతవరకూ నిర్మానుష్యంగా వున్న అక్కడి నిశ్శబ్ద వాతావరణాన్ని చెదరగొడుతూ ఒక కుటుంబం రేవులోకి దిగింది. ఇద్దరు నౌకర్లు, వాళ్ళ చేతుల్లో పెద్దపెద్ద రెండు ప్లాస్టిక్ రంగు బకెట్లు, వాటినిండా వస్తు సామగ్రి.

''రాజు వెడలె'' అన్నట్టుగా జుట్టు కొంచెం నెరసి ''రిటైరైనా'' ఇంకా వదలని ఆఫీసరు హోదా ముఖంలో కదులుతుండగా యజమాని ముందు నడుస్తున్నాడు. ''తన వెంటనె సిరి'' అన్నట్టు చిలకరంగు కంచి పట్టు చీరతో గృహిణి.

వారి వెంట ఒక ఆడా, మగా పిల్లలు.

సూర్యోదయమయింది.

పొగమంచు విడింది.

ఇల్లాలు చురుగ్గా కదిలింది.

ఒడలు సడలిన గాలికొట్టిన బెలూన్‌లా నిండుదేరి ఇంకా నిగనిగ లాడుతూనే వుంది. పిల్లల్ని రెక్కపట్టుకు లాగి గునుస్తున్నా నీళ్ళల్లోకి దింపి స్నానం చేయించింది. యజమాని స్నానం పూర్తిచేసి బట్టలు మార్చుకున్నాడు. ఇల్లాలు సావకాశంగా సిగవిప్పి స్నానం చేసి లేచింది. తడిసిన పట్టుచీర మరీ తళతళలాడింది. చీర పిండుకుని తల ముడేసుకుని తృప్తిగా చుట్టూ చూసింది.

ఎన్నాళ్ళ కోరిక ఇది. రెండేళ్ళ నుంచి శ్రీశైలం వెళ్ళి మల్లికార్జునుణ్ణి, భ్రమరాంబను దర్శించాలని, అందమైన ఆ కృష్ణ నడకలను, ఆ అడవుల సొగసును, చూడాలని భర్తను ఒకటే సలిపింది.

ఆయన రెండు చేతులా సంపాదించి విసిగి, రిటైరై దైవభక్తి పెరిగి బద్ధకం కరిగి బయలుదేరాడు.

గత రాత్రి బస్సుదిగి మంచి బస చూసుకుని ఉదయమే స్నానానికి బయలుదేరారు. దేవుడు, దేవస్థానాలు డబ్బు గలవారి పక్షమే గదా! ఏ లోటు లేదు. ఇంటి కంటె గుడి పదిలం. చీట్లు, దర్శనాలు, పూజార్లు - అంతా అరచేతిలో వైకుంఠం! కరెన్సీ నోటు చుట్టూ ప్రదక్షిణం - హరహర మహాదేవ - ధ్యానం పూర్తిచేసిన సాధువు కంఠం బిగ్గరగా పలికింది. లేచి నించుని వెళ్ళబోతున్నాడు.

ఆ పుణ్యస్త్రీ చూసింది.

చరచరా ఒక తాంబూలంలో నాలుగు అరటిపళ్ళు, రెండు రూపాయలు



పెట్టి ఎంతో భక్తితో సాధువు చేతిలో పెట్టబోయింది. ఆయన పెదవి విప్పకుండానే చిరునవ్వుతో మల్లికార్జునాలయం వైపు కుడిచేయి చూపించి వూరుకున్నాడు.

ఆఫీసరు భార్య, కలవారి ఇంటికోడలు! అహంకారం దెబ్బతిన్నది. చురుగ్గా అతని ముఖంలోకి చూసింది. నిర్విణ్ణురాలయింది. అరే అరే, అతడేనా! నీలకంఠం – మనిషిని పోలిన మనిషి వుండకూడదా?

పెదవులు ఎంతబిగబట్టి వచ్చినా, ఆ చిరునువ్వు – సుమారు 30 ఏళ్ళు వెనక్కు తీసుకువెళ్ళగలదు.

ఆ చిరునవ్వుకోసం – పెదవి విప్పి మాటాడే ఇంపయిన ఆ మాటల కోసం లోలోపల తను ఎంత ఇష్టపడేది!

కొత్తకాపురం రోజుల్లో, ఆఫీసరు భార్యగా పెరిగిన దర్జాలో, పిల్లల పుట్టుకల్లో, తర్వాత  పట్టణాల బదిలీల్లో, ఆ ముఖం మళ్ళీ కనపడకుండా మనస్సులో లోతుగా పాతేసినా – ఏదోమూల మాసిపోకుండా ఇంకా వుందన్నమాట! పోల్చిపోల్చి చూసింది. సందేహం లేదు, కోపం. ఈర్ష్య. నిర్లక్ష్యం. జాలి మనస్సును చుట్టుకుంటున్నాయి.

అందులో ఒక కైకేయి, ఒక సత్యభామ లేచి భగ్గుమన్నారు. పక్కనే ఒక చన్నీటి చెలమ కన్నీరవడం ఆ అహం ఒప్పుకోదు. నిర్ఘాంత పోయింది!

సాధువు ఒకటే చూపు – తలతిప్పి 'శివో ఽ హం' అంటూ తన మఠం వైపు నడచి వెళ్ళిపోయాడు.

''విశాల!'' అన్న పిలుపుతో మళ్ళీ తన లోకంలోకి వచ్చింది.

''వస్తున్నానండీ. ఇంక వెళ్ళిపోదాం'' అంటూ వచ్చింది.

''ఏం సాధువు పుచ్చుకోలేదా?''

''ఊహూ... ఈ సన్యాసులు వట్టి దొంగముండా కొడుకులు. అంతా నటన. పదండి''.

ఒక నౌకరన్నాడు. ''అమ్మా, ఆయన చాలా మంచోడంటారమ్మా! గుడికెళ్ళే దోవలో కుడిచేతివెంపు పాడుపడ్డ మఠం పంచలో వుంటాడు. ఎవరితో మాట్లాడడు. ఎప్పుడూ కళ్ళు మూసుకుంటాడు''.

ఆమె వినిపించుకోలేదు.

## 2

భూమి ఆకాశాన్ని ఎప్పుడూ ముద్దు పెట్టుకోలేదు. పేద ఆకాశం సంపన్నమైన భూదేవి కోసం ఏనాడూ ఆశించలేదు.

దిగంతంలో కనపడే వాటి కౌగిలి వట్టి భ్రాంతి.

భూమి ఎగియదు.

ఆకాశం దిగదు.

ఆ సాధువు చిత్తాకాశంలో ఆ మెరుపు తగని సంక్షోభం లేవదీసింది.

''.... వట్టి దొంగముండా కొడుకులు, అంతా నటన'' ఆ మాటలు సాధువు చెవుల్లో పడ్డాయి.

విశాలాక్షి మాటల్లో... ఎంతద్వేషం... ఎంత మత్సరం. వాటి వెనక దాగుడు మూతలాడే ఎంత కాంక్ష! ప్రేమకు ద్వేషానికి ఎంత దగ్గర సంబంధం – రెండూ ఒక్కచోటే కలిసిమెలిసి వుండడం – ఎంత అసహజం – ఎంత సహజం – మబ్బు గుండెను మండిస్తూ మెరుపు అక్కడే వుంటుంది. ఎప్పుడూ ఎడతెగని ఘర్షణ. ఉరుములు! అది ప్రేమా? ద్వేషమా? రెండింటికీ అతీతమైన స్థితా?.... శివో ఽ హం... శివో ఽ హం.  సాధువు విషాదంగా నవ్వుకున్నాడు.

మఠంలోకి వెళ్ళి తడిగుడ్డలు మార్చుకుని పొడి కాషాయం చుట్టబెట్టుకున్నాడు. చర్మం చుట్ట విప్పుకొని స్థిరంగా కూర్చున్నాడు. కళ్ళు మూసుకుని కామధ్వంసి, శివధ్యానంలో పడ్డాడు. ధ్యానం చెదిరి పోయింది. మనస్సు వెళ్ళగలిగినంత వెనక్కు వెళ్ళింది.

## 3

నీలకంఠానికి 13 ఏళ్ళు. తండ్రి కాంతయ్య పల్లెటూళ్లో చదువు లేదని పట్నం వచ్చి కొడుకుని హైస్కూల్లో చేర్పించాడు. సాధారణ కుటుంబీకుడు – అద్దె ఇచ్చి గది చూడలేడు. డబ్బిచ్చి హోటల్లో భోజనం పెట్టించలేడు.

తిరిగి తిరిగి సింహాద్రి గారిల్లు పట్టుకున్నాడు. సింహాద్రి గారు ఆ ఊళ్ళో సంపన్న గృహస్థు. ఆయన గురించి విని ఆశ్రయించి వారి వీధి గదిలో నివాసం, వారానికి ఏడుగురి ఇళ్ళల్లో భోజనం ఏర్పాటుచేసి వెళ్లాడు.

నీలకంఠం ఫోర్తుఫారంలో చేరి చదువుకుంటున్నాడు. పేదతనం – అణుకువ, ఇంటివారిని మెప్పించడం, లొంగి వుండడం నేర్పింది.

సింహాద్రి గారిది తరగని ఆస్తి. భార్య కామాక్షమ్మ ఇల్లు చక్కబెడుతుంది. చేతికెముకలేని ఇల్లాలని పేదా సాదా చేరుతూ వుంటారు. గారాల ఏకైక పుత్రిక విశాలాక్షి. ఆడింది ఆట! పాడింది పాట!

మెరుపుతీగ. ఎక్కడా నిలవదు! ఎవరినీ లక్ష్యపెట్టదు.

పెళ్ళిచేశారు. అల్లుడు ఏదో పట్నంలో బి.ఇ. చదువుతున్నాడు. విశాలకు 16 ఏళ్ళు వచ్చాయి. అల్లుడు చదువులో వుండడం వల్ల ఇంకా అత్తారింటికి పంపడం లేదు.

నీలకంఠం స్కూల్ ఫైనల్లోకి వచ్చాడు. ముచ్చటగా సోకుగా ఎదిగాడు. మురిపెంగా నవ్వగలడు. ఒప్పిదంగా మాట్లాడగలడు. ఎక్కడా భయం లేదు గాని,

విశాల అంటే భయం. కత్తి కొసల్లా తళతళలాడే ఆ చూపులంటే జంకు. ఆ ఎర్రని పెదవుల వెటకారం నవ్వు అంటే వణుకు, తప్పుకుని తిరుగుతాడు.

విశాల 'నీలం' అని పిలిస్తే, తోటలోకి వెళ్ళి జాజి పూలు కోసుకురమ్మంటే, పరుగుమీద వెళ్ళాలి.

ఆరోజు శ్రావణ మంగళవారం. మంగళగౌరీ వ్రతానికి పెద్ద సన్నాహం. విశాల తెల్లవారుజామునే తలంటి పోసుకుంది. పట్టుపరికిణీ, సిల్కు జాకెట్టు, జార్జెట్‌వోణీ వేసుకుని తోటలోకి పువ్వులకని పళ్ళెం పట్టుకుని బయలుదేరింది. పాలికాపు తెస్తాడంటే వినలేదు. నీలాన్ని తోడుగా రమ్మంది. అతడు చదువుకుంటున్నాడు. రానంటే చంపుతుంది. బయలుదేరాడు.

విశాల సానబెట్టిన రత్నంలా కావలసినచోట సర్దుకుంటున్న యౌవనంతో, మెరిసి పోతున్నది.

ఎప్పుడూ అతడు విశాలను తేరిచూడలేదు. చూడాలనిపించలేదు. నోట్సు, పుస్తకాలూ, అదే లోకం. గదే సర్వ ప్రపంచం!

ఆడపిల్లకు ఇంత అందం హఠాత్తుగా రావచ్చునని అప్పుడే తెలిసింది. తల వంచుకుని వెంట బయలుదేరాడు.

సంత తోటలో మాలతి, జూకామందారం, ఎర్రగన్నేరు పువ్వులు పళ్ళెం నిండా పరుగులెత్తుతూ తానే కోసింది, నీలం సాయం చేశాడు.

విశాల కళ్ళు చెట్టు సంపెంగ మీద పడ్డాయి. వాటి పరిమళం పిలుస్తున్నది. సంపెంగ చెట్టువైపు ఆశగా చూస్తోంది. "నీలం! చెట్టెక్కి కొయ్యి" అని దాని అర్థం.

అతనికి చెట్టెక్కడం అలవాటు లేదు. ఆ సుకుమారి కోరితే ఇక తిరుగు లేదు. కష్టపడి చెట్టెక్కాడు. దోసెడు పూలు కోశాడు.

ఇక దిగాలి. కొమ్మమీద నుంచి వంగి పళ్ళెంలో వేస్తున్నాడు. కొన్ని పళ్ళెంలో పడ్డాయి. కొన్ని చెదిరిపోయాయి. పట్టుతప్పి జారి పడ్డాడు. విశాల పళ్ళెం చట్టున కిందపెట్టి రెండు చేతులూ చాచింది. చేతుల్లోకి జారి ఆమె మెడ మీద చేతులు ఆనుకున్నాడు. భయంతో ఆమెను తీగలా అల్లుకున్నాడు. ఆమె మెత్తని వోణీ గుండెకు హత్తుకుంది.

ఆ మృదుస్పర్శకు ఎన్నడూ ఎదురుచూడని స్త్రీ వాసనకు అతని శరీరం స్పృహ తప్పుతున్నట్టనిపించింది. మనస్సులో మూసి వున్న తలుపులు తెరుచుకున్నాయి. పచ్చని ఆ మెడ వంపు మీద ఆనిన తన ముఖాన్ని తీసుకుని చప్పున దూరంగా నిలబడ్డాడు తల వంచుకుని. ఇష్టం వున్నా లేకపోయినా తొలిజల్లుకు పులకించిన భూమిలా ఆమె దేహం గగుర్పొడిచింది. ఒక సృష్టి రహస్యం విడిపోయినట్టుంది. ఆ స్పర్శ సుఖం అపూర్వం. ఇక తనెవరు స్పృశించినా అది రెండోదే!

అంతా క్షణికం –

ఇద్దరూ గంభీరంగా ఇల్లు చేరుకున్నారు. కాని పూర్వం వలె స్వచ్ఛంగా అమాయకంగా ఒకరినొకరు చూడలేకపోతున్నారు.

వ్రతం ఘనంగా ముగిసింది. నీలకంఠం అక్కడే తృప్తిగా భోజనం చేశాడు. విశాల వడ్డనలో తల్లికి తోడుపడింది. అంతా ప్రకృతి, వికృతి ఏమీలేదు.

తెల్లవారి నాలుగ్గడియల పొద్దెక్కింది.

## రెండు హృదయాల సంఘర్షణ



కట్టుబాట్లు, హెచ్చుతగ్గులు, అవసరాలూ, సాంప్రదాయాలు పెనవేసుకుపోయిన నాటి సాంఘిక వ్యవస్థలో మొగ్గతొడిగే రెండు హృదయాల సంఘర్షణను అతి సున్నితంగా తెలియజేసిన నాన్నగారి కథ 'నిప్పు నుంచి నీరు' అంటే నా కెంతో ఇష్టం. ఒక స్త్రీ మనస్తత్వంలోని ద్వైదీభావాన్ని నివురుగప్పిన నిప్పులా వివరించిన ఈ కథ ఎంతో మంది బాల్యస్మృతులతో దోబూచులాడుతుంది. అపరిపక్వ దశలో అనూహ్యంగా కలిగే తొలిస్పర్శ, తొలి ఆకర్షణతో రాజుకున్న నిప్పులో నిబిడీకృతమైన కన్నీటి చుక్కలను వర్షించిన కాలనేత్రం ఆవిష్కరించిన స్త్రీ హృదయమే ఈ కథ.

**–ఇంద్రగంటి శ్రీకాంత శర్మ**
సెల్ : 040-27794073

సింహాద్రిగారు ఆప్యాయంగానే పిలిచి "నీలం! పెరట్లో పని చేయించాలి, వీధి గదిలో సామాను వెయ్యాలి, గది ఖాళీ చెయ్యి" అన్నారు.

చలి పిడుగులాంటి ఈ వార్తకు నీలం కొయ్యబారిపోయాడు. తేరుకుని 'సరేనండి' అని మాత్రం అనగలిగాడు. సాయంత్రానికి తాత్కాలికంగా ఒక మిత్రుని గదిలోకి వెళ్ళి తలదాచుకోవాలి!

తాను చేసిన తప్పేమిటో తల బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

ఇది విశాల తీర్పు. సందేహం లేదు. కాని కాని... ఏం లేదు. వెళ్లడమే విధి.

పేదవాడి శరీరానికి స్పర్శ జ్ఞానం వుండకూడదు. వాడికి మనసే వుండ కూడదు. వున్నా వాటి నిర్మాణం వేరే వుండాలి. వాడు పొరపాటున ధనవంతుల పిల్లను తాకితే అది చలించకుండా రాయి అయ్యే ఏర్పాటు ఎందుకు చెయ్యలేదో భగవంతుడు అని ఆశ్చర్యపడ్డాడు. నాలుగేళ్లు గడిచాయి.

నీలకంఠం చదువు ముగించి ట్రైనింగయి ఒక సెకండరీ గ్రేడు టీచరుగా కుదురుకున్నాడు.

పెళ్లిలేదు. తండ్రి పోయాడు.

రోజు గడవడానికి ఈ ఉద్యోగం.

మిత్రుడెవరో వస్తానంటే రైలు స్టేషనుకు వెళ్లాడు. పెట్టెల్లో వెతుకుతూ వుంటే ఫస్టుక్లాసులో కిటికీలోంచి చూస్తూ విశాల. చకితుడై తల తిప్పకుండా వెడుతున్నాడు.

"నీలం! నీలం!"

వెళ్లాడు. ముఖం నిండా రాజసం. తలనిండా పువ్వులు. పెదవి మీద నవ్వు – ఏమిటో కల?

"ఇక్కడుంటున్నావా?"

"అయ్యవారు ఉద్యోగం"

"పెళ్ళి అయిందా?"

"ఎందుకూ?"

"షటప్ – తెలివి ఒలకబొయ్యకు – రా, లోపలికి –"

మేక పిల్ల! వెళ్ళాడు. దగ్గరగా జరిగి కూర్చోమంది.

"బాధపడకు – వెళ్ళగొట్టింది నేనే అని నీకు తెలుసు. ఆ అనుభవం నేను మరచిపోలేను మళ్ళా ఆ అనుభవానికి పదేపదే నిన్ను వెంటాడవచ్చు. అది ఇద్దరినీ నాశనం చేస్తుంది. మనకెంతదూరమో నీకు తెలుసు. అత్తారింటికి పట్నం వెడుతున్నాను. ఆయనకు అక్కడ ఉద్యోగం.

నాన్న రైల్లో దిగబెట్టి ఏదో తొందరపని వుందని వెళ్ళాడు... "నీ భార్యను చూడాలని వుంది... అబద్ధం ఆడుతున్నావు. పెళ్ళయింది!" అంది ముఖంలోకి కొంటెగా చూస్తూ విశాల –

"అమ్మాయిగారు పొరబడుతున్నారు... నిజం చెప్తున్నాను".

"గారూ గీరూ ఒదిలెయ్యి. తెరలు చింపెయ్యి. పొరలు విడిచి మాట్లాడు, విశాలా అని అనలేవూ".

నీలకంఠం పెదవి విరిచి నిస్పృహగా అన్నాడు.

'స్త్రీ మంచుగడ్డ! ఎంత చల్లనిదో అంత రాయి! ఆ మృత్యు శైత్యల్యం – అసహ్యం, నాకు....'

"ఈ ఉద్యోగమూ వదిలి ఎప్పుడు వెళ్ళిపోతానో తెలియదు. స్త్రీ ఎప్పుడూ నాకు అర్థం కాదు! ఆడది నా వంటికి పడదని తేలిపోయింది" వెలితి నవ్వు నవ్వాడు.

విశాల విజృంభించింది. "నీకు అసహ్యం కాదు. పిరికితనం" వీణ మీటడం తెలియక తీగలు తెంపే స్థితికి దిగజారావు. పెండ్లి చేసుకుని సుఖపడు. తెలియకుండా ఎప్పుడో అగాధంలో పడిపోతావు జాగర్త!"

ఆప్యాయంగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది. కణకణ వెలిగే ఆ కళ్ళలోంచి ఒకే ఒక్క కన్నీటి చుక్క అతని చేతిమీద రాలింది.

అతడు ఆ చేతిని తీసుకుని నుదుటికి రాసుకున్నాడు.

రైలు కూసింది.

శూన్య హృదయంతో దిగిపోయాడు.

రైలు వెళ్ళిపోయింది.

తన జీవితంలోంచే ఫస్టుక్లాసు పెట్టె దూసుకుంటూ వెళ్ళిపోయింది.

రెండో తరగతి ఎప్పుడూ రుచించదు.

చిరునవ్వుతో స్టేషన్ దాటాడు.

## 4

నీలకంఠం కృష్ణ మృగ చర్మం మీద కళ్ళు తెరిచాడు. ధ్యానం సాగలేదు.

మళ్ళా కృష్ణకు వెళ్ళి స్నానం చెయ్యాలి.

ఈ చిత్త కాలుష్యం కడిగి వేసుకోవాలి.

స్నానం చేసి సరాసరి మల్లికార్జునస్వామి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ విభూతి ముఖానికి గుండెకు రాసుకున్నాడు. 'ఇది కాముణ్ణి కాల్చిన భస్మం. ఇదే నాకు శాంతి".

"కా తే కాన్తా కస్తే పుత్రః
సంసా రో౽ యమతీవ విచిత్రః".

నెమ్మదిగా అనుకుంటూ మఠంలోకి వెళ్ళిపోయాడు.

★

*(1984 ఆగస్టు 5 – ఆంధ్రజ్యోతి దినపత్రిక)*